రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## ఉప ముఖ్యమంత్రిని కలిసిన మరి నిరంజన్ రెడ్డి

**ఆదిభట్ల డిసెంబరు31,ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడైన మరి నిరంజన్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రోడ్డు భవనాలు సినిమాట్రోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు కామెడీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రిని కలిసిన పలువురు కాంగ్రెస్ నేతలు

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** ఆంగ్ల నామ సంవత్సరాన్ని పుర స్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ గౌతమ్ పొట్రు శుభాకాంక్షలు తెలిపారు. 2024 ఏడాది ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు చేకూర్చాలని,ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలపించారు. కొత్త ఏడాదిలో సరి కొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని ఎల్లవేళలా మంచి జరగాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు. 2023లో ఎదురైన అనుభవాలను సానుకూలంగా మల్చుకుని, 2024 నూతన సంవ త్సరంలో మరింత పట్టుదల,అవిరళ కృషితో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల అమలులో కొత్త సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహాలతో పనిచేస్తూ జిల్లాను మరింత వడివడిగా ప్రగతి ప్రధాన పయనింపజేసేందుకు కలిసికట్టుగా కృషిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునందించే సంవత్సరం కావాలని కలెక్టర్ అభిలపించారు.

## మొయినాబాద్ సిఐపై బదిలీ వేటు

### భూ సంబంధిత వివాదాల్లో జోక్యం ఫలితమే..!

**మొయినాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** మొయినాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) రంగపై బదిలీ వేటు పడింది. గత కొద్ది రోజులుగా సిఐపై అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడంతో ఆయనను బదిలీ చేశారని సమాచారం. మండలంలోని కొన్ని భూ వివాదాల్లో బాధితుల పక్షాన కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌లో ఎప్పుడు అందుబాటులో ఉండరని, ఫోన్ చేస్తే జవాబు ఇవ్వరని స్థానికులు వాపోతున్నారు. పై అధికారులకు తెలియకుండా దాదాపు 25 కేసులను క్లోజ్ చేసినట్లు కూడా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. మండలంలోని హిమయత్‌నగర్‌లోని మాగంటి బద్రీనాథ్ అనే వ్యక్తికి సంబంధించినటువంటి భూ వివాదంలో తలదూర్చడంతో వారు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటువంటి భూ వివాదాల్లో అత్యుత్సాహం ప్రదర్శించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆరోపణలపై ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. పలు కేసుల్లో నిందితులకు సహకరించి బాధితులకు అన్యాయం చేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆయనపై విచారణ అనంతరం పోలీస్ కమిషనర్ బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సిఐ రంగ బదిలీ పట్ల స్థానిక ప్రజలు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా సర్వదోష నివారణ మహాయజ్ఞం



మేడ్చల్ మండలంలోని కండ్లకోయ సాయిగీతాశ్రమంలో కొబ్బరికాయ కొట్టిస్తున్న సద్దురు శ్రీ సాయికుమార్

**మేడ్చల్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** సాయిగీతాశ్రమంలో ప్రపంచశాంతి కోసం ఆదివారం వేలాది మంది భక్తులతో 59వ సర్వదోష నివారణ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మండలంలోని కండ్లకోయ గ్రామ శివారులో గల సాయిగీతాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు శ్రీ సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా చివరి ఆదివారం ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఆశ్రమంలో 59వ సర్వదోష నివారణ మహాయజ్ఞాన్ని



మేడ్చల్ మండలంలోని కండ్లకోయ సాయిగీతాశ్రమంలో నిర్వహించిన సర్వదోష నివారణ మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

సాయికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిపారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి సద్గురు సాయికుమార్ ప్రసంగిస్తూ వ్యాధులను అరికట్టడానికి, దోష నివారణకు మనలో ఉన్న షడ్ చక్రాలను జాగృతం చేసుకోవాలని, అందుకు గాను సాయి కైవల్య ధ్యాన క్రియను చేసుకోవాలని చెప్పి భక్తులతో చేయించారు. ఓంకారం, శ్రీకారం చేయడం ద్వారా వ్యాధులతో పాటు కోవిడ్ లాంటి మహామ్మారిని నుండి ప్రజలు తమను తాము కాపాడుకోవచ్చని తెలియజేస్తూ కొన్ని ఆయుర్వేద వైద్య చిట్కాలను, కర్మదోష నివారణ పద్దతులను తెలియజేశారు. ప్రకృతి అందించిన సంపదతో ఎన్నో లాభాలు ఉన్నాయని, ప్రకృతిని కాపాడితే, తనను తాను కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరు యోగా, ధ్యానం ఆచరించాలని, వాటిలోని సులువైన పద్దతులను సూచించారు. అనంతరం భక్తులతో ప్రపంచశాంతి కొరకు, మన కొరకు సామూహిక ప్రార్ధన చేయించి సామూహికంగా భక్తులతో ఏకకాలంలో కొబ్బరికాయలు కొట్టించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షా పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్, మాతా భారతీయం సత్యవాణి, కాశీక్షేత్ర శ్రీ రామానంద, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆశ్రమ ప్రముఖులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి

**చేవెళ్ల, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** పరిగి శాసన సభ్యులు రాంమ్మోహన్‌రెడ్డిని చేవెళ్ల సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పంగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలుం తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.



ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి

## శివారు ప్రాంతాల్లో అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు

### కమిషనర్ సుధీర్‌బాబు



మాట్లాడుతున్న కమిషనర్ సుధీర్‌బాబు, పాల్గొన్న అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,హైదారాబాద్,డిసెంబర్ 31 ప్రభాతవార్త:** నగర రాష్ట్ర రాజధాని నగర శివారు ప్రాంతాలైన సైబరాబాద్,రాచకొండ కమీషనరేట్ ప్రాంతాల్లో నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా రెండు కమీషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్‌లలోని ఆయా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని రా జేంద్ర నగర్, ఎల్బీనగర్,మహేశ్వరం, సరూర్‌నగర్, శంషాబాద్ తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల తనిఖీల్లో భారీగా డ్రగ్స్, గంజాయిని ఎస్‌వోటి పోలీ సులతోకలిసి పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. కొత్త సంవత్సరం వేడుకల్లో డ్రగ్స్, గంజాయిని అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారంతో సైబరాబాద్ కమీ షనర్ అవినాస్ మహంతి ఆదేశాల మేరకు రాజేం ద్రనగర్ పరిధిలోని శివరాంపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో 8 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగుళూర్ నుంచి ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి శివరాంపల్లిలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంధ్యకు సరఫరా చేశారు. సరఫరా చేసిన వారిలో అర్జున్, డెవిడ్‌లతో పాటు సంధ్యను అరెస్ట్ చేసి విచాచరణ జరుపుతున్నారు. కొత్త సంవత్సరం వేడుకల కోసమే ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.ఇదిలా ఉండగా ఎల్బీనగర్ పరిదిలోని మీర్‌పేట ప్రాంతంలో ఎండి ఎంఏ 100 గ్రాముల డ్రగ్స్ తరలిస్తున్న ఒక ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనున్న మూడు సెల్‌ఫోన్లు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకుని ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నయా సాల్ వేడుకల సందర్భంగా శంషాబాద్, మహేశ్వరం, సరూర్‌నగర్‌లో కూడా భారీగా గంజాయిని రవాణ చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు.

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ..నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఎక్కడ అవాంచనీయ సంఘటనలు జరిగిన తక్షణమే చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఇతరులకు ఇబ్బంది కల్గించే చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుపై రాత్రి 10 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు విమానా శ్రయం వెళ్లే వాహనాలకు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదన్నారు. శిల్పా,గచ్చిబౌలి, బయో, షేక్‌పేట్, మైండ్, రోడ్డు నెం 45, దుర్గం చెరువు, సైబర్ టవర్, పోరమ్ మాల్స్ జేఎన్‌టీయూ, ఖైతారా బాద్, బాబు జగ్జీవన్ రామ్ తదితర ఫ్లైఓవర్ పై ప్రజలు తమ ప్రయాణ ప్రణాళికలను తదనుగుణంగా రూపొందించుకుని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు.

## ప్రజలకు సేవకునిగా పని చేస్తా

### సిద్దాపూర్ విజయోత్సవ సభలో వీర్లపల్లి శంకర్
### అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అదేలా కృషి చేస్తా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

**కొత్తూర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** కుటుంబ పాలన స్వస్తి చెప్పి నన్ను నమ్మి గెలిపించినందుకు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కొత్తూర్ మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలను భారీ గజమాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....తనపై నమ్మకంతో తనను కన్నబిడ్డలాగా భావించి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్మరిస్తున్నాని తెలిపారు. మీకు ఏ సమస్య వచ్చిన 24గంటలు నా ఇంటి తలుపులు తీసే ఉంటాయన్నారు. వాస్తు ప్రకారం ఎన్నికల్లో ఈశాన్య గ్రామమైన సిద్ధాపూర నుండి ప్రచారం మొదలుపెట్టామని, బీఆర్ఎస్ పదేళ్ల రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు కంకణ బద్దులై సిద్దాపూర్ గ్రామంలో భారీ మెజార్టీ ఇచ్చారని, ఈ ఘనత సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం, ప్రజలకు నచ్చిన ప్రభుత్వం, ప్రజలు కోరుకుని తెచ్చుకున్న ప్రభుత్వం కాబట్టి ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎవరు అధైర్యపడొద్దని అందరికి సంక్షేమాలు అందుతాయన్నారు. మేము పాలకులం కాదు.. సేవకులం ఇది మా ప్రభుత్వ నినాదం అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతా ప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. ప్రజలు గడీల పాలన నుండి విముక్తి చెందారు. ప్రజాభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తు న్నారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంద న్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జె.సుదర్శన్‌గౌడ్, ఎస్‌బిపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఎంపీటీసీ డాకి, కొత్తూర్ మున్సిపల్ కౌన్సిలర్ దేవేందర్ ముదిరాజ్, సిద్ధాపూర్ మాజీ ఎంపీటీసీ రాసుల జంగయ్య, ఎల్లారం నరసింహారెడ్డి, ఎల్లారం ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌కె ఖాజా, ఎస్.కె జాఫర్, ఎల్లారం రవీందర్‌రెడ్డి, కుమార్, వడ్డే వెంకటయ్య, కాంగ్రెస పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా యువత



ఘట్‌కేసర్‌లో కేక్‌కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం రాత్రి ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో చిన్నా పెద్దా సంబరాలను ఎంతో వేడుకగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అర్ధరాత్రి 2023 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2024 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. యువకులు కేరింతలతో బైక్‌లపై విహరించారు. రాత్రి కేక్‌లు కట్‌చేసి అందరికి పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. ఫోన్ ద్వారా హప్పి న్యూ ఈయర్ అంటూ సోషల్ మీడియా ద్వారా సందేశాలను పంపుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, చౌదరిగూడ, ఘణాపూర్, కొండాపూర్, వెంకటాపూర్, మర్రిపల్లిగూడ, ఎన్ఎఫ్‌సినగర్, వెంకటాద్రి టౌన్‌షిప్‌కాలనీ తదితర చోట్ల నూతన సంవత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు హస్టళ్లు, బేకరీలు, రెస్టారెంట్‌లలో యువతీ, యువకులు వేడుకలు జరుపుకొని కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. మద్యం దుకాణాలు, బార్లు మందుబాబులతో కిటకిటలాడాయి. మద్యం అమ్మకాలు గతంలో కంటే రెట్టింపు అయ్యాయి. మాంసం, చికెన్, చేపలు, కేకుల విక్రయాలు జోరుగా జరిగాయి. ఘట్‌కేసర్ పట్టణంలో కేక్‌ల దుకాణాలు ఏర్పాటు చేసి కిలో కేక్ 400 నుంచి 700 రుపాయల చొప్పున అమ్మారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మున్సిపల్ ప్రజలకు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరికి 2024 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఆర్‌పిఎస్–టిఎస్ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ మీసాల మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాసం..భక్తుల నిత్య పూజలు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్‌నాయకస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసంలో నెలరోజుల పాటు విష్ణుమూర్తిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఆదివారం 16వ రోజు తిరుప్పావైలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఈనెల 16 వరకు ప్రతిరోజు తిరుప్పావై ప్రబంధ సేవాకలం, అరగింపు తీర్థ ప్రసాద ఘోష్టి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా గ్రామస్తులు నిత్యం ఉదయమే ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నెల రోజుల పాటు నిత్యం ధనుర్మాస పూజల్లో భక్తి, నియమ నిష్ఠలతో పాల్గొంటున్నామని భక్తులు తెలిపారు. జనవరి 12న అధ్యయనోత్సవములు ప్రారంభం, 14న నమ్మాళ్వార్ పరమ పదోత్సవం, 15న సంక్రాంతి సందర్భంగా శ్రీగోదారంగనాయకస్వామి కళ్యాణోత్సవం, 16న శ్రీగోదాదేవి (అండాళ్) అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ధనుర్మాస పూజల్లో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు.



గోదా రంగనాయకస్వామిని దర్శించుకున్న భక్తులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్

## క్రీడలతో మానసిక ఉల్లాసం

### మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న
### కెవిసిఎస్‌లో ఘనంగా క్రీడోత్సవాల ముగింపు

**తాండూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. పట్టణంలోని క్రిష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో గత మూడు రోజులుగా విద్యార్థులకు పాఠశాల స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అథితిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృడత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. క్రీడలు మేధాశక్తితో పాటు స్నేహ బంధాలను బలపరుస్తాయన్నారు. ప్రసుత్తం పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థుల చదువుపైనే ఒత్తిడిని పెంచే యాజమాన్యాలు విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించడం చాలా సంతోషకరమని అన్నారు. అనంతరం వివిద క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, డైరెక్టర్ సతీష్‌కుమార్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల కాంగ్రెస్ నేతలు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చేవెళ్ల కాంగ్రెస్ నేతలు

**చేవెళ్ల, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డిని చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో చేవెళ్ల, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి,ఉపసర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీనికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక, మానవీయ విలువలను పాటించాలి

### భీమా కోరేగాన్ శౌర్య దివాస్



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న లాజర్, సత్యం, అరుణ్‌కుమార్ తదితరులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** అంటరానితనం, అస్పృశ్యతను, కులవివక్షపై అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదని వ్యాపారవేత్త జె.లాజర్, హోలీమేరి కళాశాల సహాయ ప్రొఫెసర్ కె.సత్యంలు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ఆదివారం 142వ వారం నిత్యపూల కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి లాజర్, సత్యంలు ముఖ్యఅతిధిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. భీమా కోరేగావ్ యుద్ధం జరిగి 2024 జనవరి 1కి 206 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా భీమా కోరేగాన్ శౌర్య దివాస్‌ను నిర్వహించి స్మారక స్థూపం చిత్రపటానికి పూలమాళ వేసి వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. నాయకులు ఉట్కూరి అశోక్‌గౌడ్, కె.నర్సింగ్‌రావు, థోకా బాలయ్య, బాలాజీ, మేకల నర్సింగ్‌రావు, సి.ఆన ంద్, కృష్ణంరాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి

**జ్యోతి యాదగిరిగౌడ్**



ఉచితంగా ఇంటింటికి దరఖాస్తులు పంపిణి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎ.జ్యోతియాదగిరిగౌడ్,చిత్రంలో సాయి కిరణ్, లక్ష్మణ్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త : ప్రజాపాలన కార్యక్ర మానికి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఎ.జ్యోతి లక్‌పతి యాదగిరిగౌడ్ అన్నారు. ఆదివారం నల్లకుంటలో యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయి కిరణ్, నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మన్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి ఉచితంగా దర ఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా జ్యోతి లక్‌పతి యాదగిరిగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభయ హస్తం ఆరు గ్యారెంటీల హామీలను అర్హులైన స్థానికులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ రెండు లక్షల నుంచి 10 లక్షల వరకు, మహాలక్ష్మి రూ.2500, 500కే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునేవారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఇంటి యజమాని పాస్‌పోర్టు సైజు ఫొటో ఉంటే సరిపోతుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చే రశీదును జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఆధార్ సవరణలు అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న కార్డు జిరాక్స్ మాత్రమే జతపర్చాలని చెప్పారు. అర్హత ఉండి పెన్షన్ రాని వారు చేయూత పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కుల్లో సంప్రదించాలన్నారు.

## 49వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలకు
# జూనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపికలు

నిజాంపేట్, డిసెంబర్ 31, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర బాలికలకు మేడ్చల్ మల్కాజగిరి జిల్లా జట్లకు ఎంపికలు, కాసాని కబడ్డీ అకాడమీ బాచుపల్లి నందు జరుగుతాయని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేష్ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనదలచిన వారు బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు, 20 సంతవ్సరాలలోపు (05.02.2004) తరువాత పుట్టినవాళ్ళు తమ ఆధార్ కార్డుతో 07.01.2024వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు షకీల్ ఫోన్ నంబర్ – 7396749998 సంప్రదించ గలరని తెలిపారు. ఎంపికైనటువంటి మేడ్చల్ మల్కాజగిరి జిల్లా జూనియర్ బాలుర, బాలికల జట్టు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఐసిసి గ్రౌండ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ 11.01.2024 నుండి 14.01.2024ల మధ్య నిర్వహించే 49వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో ప్రాతినధ్యం వహిస్తారని తెలిపారు. మేడ్చల్ మల్కాజగిరి జిల్లాకు చెందిన జూనియర్ బాలురు, బాలికలు ఈ ఎంపిక పోటీలలో పాల్గొని, తమ ప్రతిభని కనబరిచి 49వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో పాల్గొని మేడ్చల్ జిల్లాకు ప్రఖ్యాతి తీసుకురావాలని కాసాని వీరేష్ ముదిరాజ్ కోరారు.

## ఘనంగా కూకట్‌పల్లి అయ్యప్ప దేవాలయంలో వార్షికోత్సవం



అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి రంగుడు స్వామి ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాలు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : కూకట్‌పల్లి వివేకానందనగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం 32వ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు దేవాలయ కమిటీ చైర్మన్, గురుస్వామి వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం లక్ష్మీ గణపతి హోమం, గోమాత పూజ, 108 కలశముల పూజ, అన్నదానం, సాయంత్రం అయ్యప్ప స్వామి వారి ఊరేగింపుతో కూకట్‌పల్లి ఆధ్యాత్మికమయంగా మారింది. అలాగే ఆదివారం ఉదయం లక్ష్మీ గణపతి హోమం, అరాట్ మహోత్సవం, 18 కలశముల పడిపూజ కార్యక్రమం మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి, యోగేశ్వరశర్మలచే వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అయ్యప్పస్వామి వార్షిక ఉత్సవాలతో కూకట్‌పల్లి ఐక్యతకు మారుపేరని మరోమారు ఋజువైందని అన్నారు. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప స్వాముల శరణుఘోషతో మారుమ్రోగింది. ఈ ఉత్సవాల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : కొత్త సంవత్సరం 2024లో కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకాంక్షించారు. 2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో తాము తీసుకున్న నిర్ణయాలతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమై జీవితంలో మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్ళాలని తల్లిదండ్రులు కూడా పిల్లలకు సున్నితంగా వివరిస్తూ ఉండాలని తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కూడా జీవితంలో ముందుకు వెళ్ళడానికి తాము నిర్దేశించుకున్న ప్రణాళికతో విజయ తీరాలకు చేరాలని ఆకాంక్షించారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తాం : జంపనప్రతాప్



బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభించిన జంపనప్రతాప్

కంటోన్మెంట్,డిసెంబర్ 31 ప్రభాతవార్త: క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించేందుకు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని అసోసియేషన్ చైర్మన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని ఎస్.సి.బి.ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్, అండర్ -22 టెన్నిస్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. ప్రధమ జట్టు విజేతలకు 10 వేలు, ద్వితీయ జట్టుకు 7 వేల నగదు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి వి.ఆర్. ఆసుపత్రి ఎండి నంద కిషోర్, నాయకులు షకీబ్, షరీఫ్, సయ్యద్ షిరాజ్, అర్షద్, ఫిరోజ్ ఖాన్, గబ్బర్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట్, డిసెంబర్ 31, ప్రభాతవార్త : సచివాలయంలో రాష్ట్ర తెలంగాణ ఐటిశాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ శ్రీధర్‌బాబును ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్‌రెడ్డి, కోలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 6గ్యారెంటీలు, రాబోయే పార్లమెంట్ ఎలక్షన్లకు సంబంధించిన విషయాలపై, అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

## వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడపితే సహించేది లేదు

ట్రాఫిక్ సిఐ మధు



వాహన దారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు

కంటోన్మెంట్,డిసెంబర్ 31 ప్రభాతవార్త: వాహన దారులు రోడ్డు భద్రతా సూత్రాలను తప్పని సరిగా పాటించాలని తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు తెలిపారు. ఆదివారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ వాహన దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ట్రాఫిక్ సిఐ మధుబాబు మాట్లాడుతూ వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడుప కూడదని సూచించారు. అదే విధంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, సెల్‌ఫోన్, త్రిబుల్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహాపడి పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు



అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 31ప్రభాతవార్త: జాంబాగ్ పూల మార్కెట్‌లో జరిగిన అయ్యప్ప స్వామి 18వ మహా పడి పూజను భక్తి శ్రద్దల మధ్య నిర్వహించారు. మహా పడి పూజలో తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త పాల్గొన్ని పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో నవీన్‌గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో రాఘవ,రాజారాంస్వామి,శేఖర్‌స్వామి, శ్రీకాంత్‌స్వామి, జితీన్‌స్వామి పాల్గొన్నారు.భక్తులకు అన్నదానం చేశారు.

## గాంధీనగర్‌లో భక్తిశ్రద్దలతో అయ్యప్పస్వామి మహాపడిపూజోత్సవం



చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని వాల్మీకినగర్‌లో సుక్క యాదగిరి గురుస్వామి ఆధ్వర్యంలో స్వామి శరణం అయ్యప్ప స్వామివారి పడిపూజా మహోత్సవ కార్యక్రమం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అభిషేక పంచామృత అభిషేకం, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు విఎస్టీ.రాజు, బండారు భరత్‌స్వామి, నర్సింహా, సాయికుమార్, ఆనంద్‌రావు, సిహెచ్.యాదగిరి, సంతోష్(గురుస్వామి), తులసి తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయ్ పూలే జయంతి సభను విజయవంతం చేయండి

**బీసీ సంక్షేమ సంఘం**

**జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**



సావిత్రిబాయ్ పూలే జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాసగౌడ్, మణిమంజరి తదితరులు

ముషీరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త: జనవరి 3న రవీంద్రభారతిలో జరగబోయే సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం దోమలగూడ లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌లను బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు, సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ మణిమంజరితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ బడుగులకు అక్షరాలు అందించి, అణగారిన జీవితాలలో వెలుగులు నింపిన గొప్ప సంఘసంస్కర్త, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. మూఢనమ్మకాలు, సతీసహగమనం వంటి దురాచారాల పట్ల మహిళలను చైతన్యం చేసిన సావిత్రిబాయిపూలే స్ఫూర్తితో మహిళలు ముందు కుసాగి, అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి బడుగు, బలహీన వర్గాలకు ఒక పండుగ వంటిదని, సబ్బండ వర్గాలందరూ ఊరు, వాడ, దేశవ్యాప్తంగా సావిత్రి బాయి పూలే జయంతిని పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనవరి 3 రవీంద్రభారతిలో జరిగే సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ బుర్రా వెంకటేష్ తదితరులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న 300 మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలకు అవార్డులు ప్రదానం చేసి, ఘనంగా సత్కరిస్తున్నామని తెలిపారు. అనంతరం మణిమంజరి మాట్లాడుతూ మహిళా తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు నేటి తరం మహిళలంతా పాటుపడాలని సూచించారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు అందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాళ్లు స్వర్ణగౌడ్, తారకేశ్వరి, సమత, రేణుకాదీప్తి, సంధ్యారాణి, దేవిక, లావణ్య, విజయలక్ష్మి, వాణి, పద్మశ్రీ, రేణుక పాల్గొన్నారు.

## అయోధ్య రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో కరసేవకులకు సత్కారం



కరసేవకులను సత్కరిస్తున్న అయోధ్య రామజన్మభూమి ట్రస్ట్ తీర్థ ప్రతినిధులు, కార్పోరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త: అయోధ్య రామమందిరం కోసం 1990లో జరిగిన కరసేవలో పాల్గొన్న కరసేవకులను అయోధ్య రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం కవాడిగూడలో అయోధ్య రామజన్మభూమి ట్రస్ట్ తీర్థ దోమలగూడ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ బౌదిక్ ప్రముఖ్ క్షీర సాగర్‌శివాజీ, కస్తూరి రంగన్, కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ పాల్గొని కరసేవకులను సత్కరించారు. అయోధ్యలో రామమందిరం పూర్తి అయిన నేపధ్యంలో ఈ సత్కార కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. జనవరి 22 వ తేదీన అయోధ్యలో శ్రీరామ్‌లాలా విగ్రహ ప్రతిష్టాపన జరుగుతున్న నేపధ్యంలో దేశవ్యాప్తంగా దీపావళి జరుపుకోవాలని వారు సూచించారు. ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించి, రాముని చిత్ర పటానికి పూజలు నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వై.శ్రీనివాస్, జి.ప్రేమ్ కుమార్, పాస్‌పోర్ట్ శ్రీనివాస్, శంకర్, ఏ.ప్రభాకర్‌గంగపుత్ర, శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్‌లు పాల్గొన్నారు.

## దోపిడీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త :డిసెంబర్ 15వ, 17వ తేదీలలో జరిగినటువంటి దోపిడీలపై ప్రత్యేక నిఘా పెట్టారు పోలీసుల. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3గంటల ప్రాంతంలో సుచిత్ర సిగ్నల్స్ దగ్గర మఫ్టీలో ఉన్న పోలీసులు నిందితుడికోసం గాలిస్తున్నారు. అదే ప్రాంతంలో అనుమానస్పదంగా కనిపించిన ఎండీ అబ్బాస్‌ను పట్టుకుని దోపిడీల గురించి విచారించగా తాను దోపిడీలు చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు నేరస్థుడిని అందుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి ఒక మొబైల్ ఫోన్, మూడు వందల రూపాయలను రికవరీ చేసి రిమాండ్ తరలించారు.

## ఎల్ ఎన్ నగర్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మృతి

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 31, ప్రభాతవార్త : యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహ నగర్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ఈశ్వర్‌రావు ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఈయన అస్వస్థతకు లోనై ఉన్నారు. ఈశ్వర్‌రావుకు నలుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా సోమవారం ఉదయం పంజాగుట్ట శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు దాసరి వేణుగోపాల్ తెలియజేశారు. ఈశ్వర్‌రావు ఎల్ ఎన్ నగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించి బస్తీ అభివృద్ధికి విశేషకృషి చేశారు. అంతేకాకుండా బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ మైత్రీ కమిటీ సభ్యులుగా కొంతకాలం కొనసాగారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

## సూర్యానగర్‌లో నూతన సంవత్సర సంబురాలు

చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లిలోని సూర్యానగర్‌లో సర్వోదయ కాలనీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. న్యూ ప్రగతి ట్యుటోరియల్స్‌చే నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వర లక్ష్మి, ఉపాధ్యాయులు భాగ్య, భాగ్యలక్ష్మి, గణేష్, రోహిణి, సర్వోదయ కాలనీ, సుమన్, శేఖర్, మధు, ప్రతీక్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో ఆర్యవైశ్యులు: అమరవాది లక్ష్మినారాయణ గుప్తా



పదవీ ప్రమాణం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త: ఆర్యవైశ్యులతో పాటు సమాజ హితం కోసం ఆర్యవైశ్యులు ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ గుప్త పేర్కొన్నారు. లాలాపేట్ ఆర్యవైశ్యసంఘం నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా మడిపడిగ శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శిగా పందిరి సాంబశివరావు, కోషాదికారిగా యెనిశెట్టి భాస్కర్‌లతో పాటు నూతన కమిటీ సభ్యులు పదవీభాధ్యతలను స్వీకరించారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మిణారాయణ గుప్త హాజరై నూతన కమిటీని అభినందించి మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు వరుసలో ఉంటారని చెప్పారు. అనంతరం తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నేతిరాములు గుప్త, నూతన అధ్యక్షుడు మడిపడిగ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంఘం 31సంవత్సరాలుగా పేద ప్రజలకు,కులస్థులకు సేవందిస్తుందన్నారు. ఆధ్యాత్మికంగా ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. వాసవీ అమ్మవారి దేవాలయాన్ని నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు వికలాంగులకు ట్రైసైకిళ్లను, పారుశుద్యకార్మికులకు చీరెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్యాల జగదీశ్వర గుప్త, యెనిశెట్టి కృష్ణగుప్త, ఎలగందుల లక్ష్మణ్ రావు, ఇంగు వెంకటేశం గుప్త, విబిజి పౌండేషన్ చైర్మన్ మడిపడిగ రాము గుప్త, మహిళా విభాగం అధ్యక్షులు యెనిశెట్టి శ్రీదేవి గుప్త, ప్రధాన కార్యదర్శి ఉప్పల లక్ష్మిగుప్త, కోషాదికారి తోడుపునూరి స్వాతి గుప్త, ప్రోగ్రాం చైర్మన్ యెనిశెట్టి సూర్యనారాయణ గుప్త, కార్యవర్గ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, శ్రీరాం సత్యనారాయణ(బండల)తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇందిర ఆర్ట్స్ సినీ గానలహరీ

చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వహణలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 'మల్లెపూల మారానికి బంతిపూల పారాణి' పేరుతో సినీ గానలహరి కార్యక్రమం ఆరు గంగటల పాటు సాగింది. ప్రధాన గాయనీ ఇందిర సహ గాయనీ గాయకులు సురేశ్, ఆనందరెడ్డి, శ్రుతి, జ్యోతి, వైష్ణవి తదితరులతో కలిసి తెలుగు, హిందీ చిత్రగీతాలాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నిర్మాత, నటులు శ్రీనివాస్‌రావు, సినీనటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ ఇందిర స్వయంగా గాయనీ అయినా తోటి గాయనీ గాయకులకు ప్రోత్సహించడం కోసం సంస్థను స్థాపించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లూరి విల్సన్ నివేదిక సమర్పించారు.

## పాతబస్తీ అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించాలి

**ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్**



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్ మహ్మద్ సలీం

చార్మినార్, డిసెంబరు 31 ప్రభాతవార్త : ప్రజలు ఆరోగ్యం పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ అన్నారు.పాతబస్తీ షంషేర్‌జంగ్ వెస్టన్ న్యూరో ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ పాతనగరం కొత్త నగరంతో సమానంగా అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి చెందవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ సలీంతో పాటు ఆసుపత్రికి చెందిన వైద్యులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా అనాథలకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు అందజేసిన జెంస్‌ఆర్ ఎఆర్‌సి అట్రోమ్ ఫ్లాట్స్ ఓనర్స్ పిడబ్ల్యూఎంసి గ్లోబల్ ప్రెసిడెంట్ కె.సురేందర్

## సావిత్రిబాయ్‌పూలే జన్మదినోత్సవాన్ని 'మహిళా టీచర్స్‌డే'గా గుర్తించి ప్రభుత్వం నిర్వహించాలి

**జాతీయ ఎంబిసి సంఘాల సమితి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ**

చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త: భారతదేశ చరిత్రలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయ్‌పూలే జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 'మహిళా టీచర్స్‌డే'గా గుర్తించి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జాతీయ ఎంబిసి సంఘాల సమితి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ రాష్ట్రముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖలు రాశారు. మహాత్మజ్యోతిరావు పూలేతో కలిసి ఎంతో అనాధలైన వితంతు మహిళలకు వివాహాలు చేశారని, వివక్షతకు గురైన స్త్రీలను చేరదీసి ఆశ్రయం నడిపిన వీర వనిత సావిత్రిబాయి జన్మదినోత్సవం అయిన జనవరి 3న 193వ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన అనంతరం ఎంతో మంది పోరాటయోధులకు, తగిన గౌరవం, గుర్తింపు నిచ్చి అనేక మంది జయంతులను గత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని, అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. దేశ చరిత్రలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జన్మదినోత్సవాన్ని అధికారికంగా జరిపేవిధంగా ప్రభుత్వం అడుగులు వేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించాలని విజ్ఞప్తి చేశారు.

## ఔట్‌సోర్సింగ్ కార్మికులకూ 5లోపు జీతాలు ఇవ్వాలి

నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : రాష్ట్రంలో పని చేస్తున్న లక్షలాది మంది డెయిలీవైజ్ ఎన్ఎంఆర్, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా 5.వ,తేదీలోపు జీతాలు ఇవ్వాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ కార్యదర్శి మహ్మద్ ఫారుఖ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్యోగస్థులందరికి ప్రతీనెల 5.వ,తేదీ లోపు జీతాలు ఇస్తామని ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగులం నెలంతా పని చేసి ఒకటో తేదీన జీతం పడుతుందన్న ఆశతో ఉంటామని తెలిపారు. గత పాలకులు ప్రభుత్వ ఉద్యోగులకే జీతాలు ఆలస్యంగా ఇచ్చే వారని, ఇక మాలాంటి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల మొరను పట్టించుకోలేదన్నారు. నెలంతా పని చేసినా ఎప్పుడు జీతాలు ఇస్తారో అని మేమంతా బిక్కుబిక్కుంటూ ఎదరి చూసే వారమన్నారు. లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు జీతాలు సవ్యంగా రాకపోవడంతో ఇంటి అద్దెలు చెల్లించలేక, కిరణా సరుకుల బిల్లులు చెల్లించలేక నరకయాతన పడ్డారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిస్థితిలో చాలా మార్పు కనిపిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు మాపై కూడా కరుణ కురిపించాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులమంతా కోరుకుంటున్నామని ఫారుఖ్ తెలిపారు.

## పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా వార్షిక క్రీడోత్సవం




వార్షిక క్రీడోత్సవ వేడుకల్లో పాల్గొన్న జాతీయ క్రీడాకారుడు కిరణ్ రెడ్డి,డా.శ్రీనివాసరావు తదితరులు

నాచారం, డిసెంబర్ 31 ప్రభాతవార్త: పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రెజిల్ డ్యాన్స్, కరాటే, బటర్‌ఫ్లై రేస్, డంబ్ బెల్ డ్రిల్, మషాల్ రన్‌తో పాటు పలు ప్రదర్శనల ద్వార వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకలకు మాజీ జాతీయ వాలిబాల్ క్రీడాకారుడు, క్రికెట్ అండ్ పిట్నెస్ నేషనల్ అకాడమి వ్యవస్థాపకుడు కిరణ్ రెడ్డి, అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డా. సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎప్పటికి వదులుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ కోదూరు, డైరెక్టర్ అనురాధ సూరపరాజు, హైకోర్టు న్యాయవాది ఎస్.వి.ఎస్.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

# అస్సాం సిఎం హిమాంత్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

వడ్లమూరి డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: సూద్రులు, దళిత బహుజనులపై అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమం త్రి హిమంత్‌బిసా వ్శర్మపైన కఠినంగా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రధాని నరేంద్రమోదీని డిమాండ్ చేశారు. ఆర్య, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్య వైశ్యలు మూడు వర్ణాలకు సేవలు చేయడానికే సూద్రులను బ్రహ్మ పుట్టించారని, సూద్రులు మూడు వర్ణాలకు బానిసలుగా ఉండాలనే సనాతన ధర్మం మార్గంలో బిజెపి సర్కార్ పనిచేస్తున్నదని ఆరోపించారు. ఆదివారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల విచ్ఛన్నం, కుల ద్వేషం, దురహంకారంతో రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడిన అస్సాం ముఖ్యమంత్రిపైన తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను డిమాండ్ చేశారు. సిఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, సూద్రులకు, దళిత బహుజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిమంత్‌బిశ్వశర్మ ప్రకటనలకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లోని ఎస్సీ, ఎస్టీ, బిసిలు నేతలు బయటకు వచ్చి ఇప్పటికైనా పరివర్తన చెందాలని సూచించారు. ఈ దేశ భూమిపుత్ర సామాజిక పరివర్తకులు, మహానీయులు డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతి భాపూలే గౌతమబుద్ధిని మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇటీకాల గణేష్, పెండ్యాల సుచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను

# ప్రతిఘటించేందుకు మానవ సమాజం బాసటగా నిలవాలి

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గమైన మారణకాండను ప్రతిఘటించేందుకు మానవ సమాజం బాసటగా నిలవాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణలను, దమనకాండను ఖండిస్తూ పాలస్తీనాకు అండగా నిలవాలని వక్తలు కోరారు. ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటి ఆధ్వర్యంలో ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పాలస్తీనా స్వేచ్ఛా కోసం గళమెత్తుదాం, వ్యాసాల సంకల్పన పుస్తకాన్ని ఎఐటియుసి మాజీ కార్యదర్శి డా.బి.వి.విజయలక్ష్మి, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, మర్ల సోమసుందర్, కవి, రచయిత స్కైబాబు, అన్వర్‌పాషా ఆవిష్కరించారు. ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ పాలస్తీనాపై దుర్మార్గంగా మారణకాండా జరుపుతున్నా ప్రపంచమంతా మౌనంగా ఉండటం బాధకరంగా ఉందన్నారు. పాలస్తీనాపై ఒక జాతి చేస్తున్న హింస కాదని న్యాయా, న్యాయాల మధ్య పోరాట మని చెప్పారు. చరిత్రను తెలుసుకోవడానికి పాలస్తీనా పుస్తకంగా ఉపయోగపడుతుందన్నారు. అమెరికా పెద్దన్నల అండతోనే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులకు, యుద్ధానికి తెగబడుతున్నదని ఆరోపించారు. స్కైబాబు మాట్లాడుతూ సోషలిజం, కమ్యూనిజం సమాజం కోసం కలలు గంటున్న క్రమంలో 21వ శతాబ్ధంలో ఇజ్రాయిల్ వేటాడుతూ, వెంటాడుతూ పాలస్తీనా ప్రజలను చంపుతున్నదని ఆరోపించారు. ఈ మారణకాండను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ సత్యప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ స భ్యుడు వి.ఎస్.బోస్ పాల్గొన్నారు.

# పవిత్రమైన ప్రజా సమాజసేవకు నిదర్శనం వైద్యులు



వైద్యశ్రీ అవార్డు గ్రహీతలతో వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ, మల్లికార్జునరావు, రాఘం తదితర అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 31 ప్రభాతవార్త : సమాజంలో నివశిస్తున్న ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఆనందోత్సా హాలతో తమ జీవితాలను గడిపేందుకు వివిధ కారణాల దృష్ట్యా అనారోగ్యాలకుగురై ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు తమ బాధ్యతగా అద్భుత వైద్యసేవలందిస్తూ ఆరోగ్య సమాజంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు సమాజసేవలు చేస్తున్న పవిత్రమైన వైద్యవృత్తిని సాగిస్తూ ప్రజా సమాజసేవకే అంకితమవుతున్న వైద్యుల సేవలు ఎనలేనివి అనితరసాధ్యమైనవని, ఆలాంటి సేవలందిస్తున్న వైద్యుడే నారాయణుడుతో సమానమని, వారిని వైద్యశ్రీ అవార్డుతో సత్కరిస్తున్న సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జున రావును, కార్యవర్గాన్ని అభినందించారు. మెగాసిటీ నవకళావేదిక సంస్థల 24వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన వైద్యశ్రీ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశిష్ట అతిథులు డా. అశిష్ చౌహాన్, కంజర్ల ఈశ్వర్‌చారి, సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు రాఘన, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి వైద్యరంగంలో ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న సమాజంలోని ప్రజలకు విశిష్ట వైద్యసేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు పాతికమందిని ఘనంగా సత్కరించి వైద్యశ్రీ అవార్డులను ప్రదానంచేసి శుభాభినందనలు అందజేశారు.

## సాంకేతిక రంగంపై అనేక కథనాలు



అవార్డు అందుకుంటున్న ముద్దం స్వామి

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: డిజిటల్ మీడియ జర్నలిజంలో ప్రభావితం చూపిస్తున్న స్వామి ముద్దంకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మకమైన సైబా సౌత్ ఇండియా ఇన్‌ఫ్లుయెన్సర్స్-2023 అవార్డును అందుకున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమంలో నిర్వాహకులు స్వామి ముద్దంకు అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తనకు ఈ గౌరవాన్ని అందించిన సైబా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక రంగంలో పాత్రికేయ సమగ్రత కోసం అత్యున్నత ప్రమాణాలను నిలబెట్టడానికి తన నిబద్ధతను ఈ సందర్భంగా తెలియజేశారు. డిజిటల్ మీడియా తరువాత వచ్చే మెటావర్స్ మీడియా మానవాళిపై ఏలాంటి ప్రభావం చూపనుందో ఆయన వివరించారు. మానవాళిపై ప్రభావితం చేస్తున్న సాంకేతిక రంగంపై ఆనేక కథాలు రాస్తున్నారని, మంచిని ఎలా ఉపయోగించుకోవాలో, చెడుపై ఏలా అప్రమత్తత ఉండాలో ఎప్పటికప్పుడు రాస్తూ పలు సూచనలు చేస్తున్నారని చెప్పారు. మానవతావాదిగా, దార్శనికుడిగా, పాత్రికేయుడిగా అతని బహుముఖ రచనలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు కొనియాడారు.

## అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు



అప్జల్‌గంజ్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: మాసబ్ ట్యాంకు పోచమ్మబస్తీ ప్రజలు డాక్టర్ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి 69వ ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ల ఆర్పించారు. ఈసందర్భంగా టిఎన్‌జిఓ విద్యాశాఖ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత 70 వారాలుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, భాద్యతలు నేటి యువత, యువకులు తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు రవీందర్, వెంకటేష్, జి, మహేష్ గౌడ్, ఆర్.కె.శ్రీనివాస్, వేణు, ప్రవీణ్, శ్రీహరి గౌడ్, ప్రతాప్ గౌడ్, శ్రీకాంత్.శ్రీనివాస్, జబ్బార్, అబ్దుల్లా, యాదయ్య పాల్గొన్నారు.




పద్మశాలి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బండకార్తిక చంద్రారెడ్డి

## మార్కెండేయ పద్మశాలి క్యాలండర్ ఆవిష్కరణ

తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త: లాలాపేట్ మార్కెండయ పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను నగర మాజీ మేయర్ బండకార్తిక చంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. తనకు ఎప్పుడు సపోర్ట్ చేస్తున్న పద్మశాలిలకు అండగా ఉంటానని చెప్పారు. తార్నాక డివిజన్ అంటే తనకు ఇంటి కంటే ఎక్కువ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేషం, పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఛైర్మన్ దోమల లక్ష్మణ్ దాస్, వైస్ ఛైర్మన్ ఉద్దెమర్రి దేవేందర్, ప్రధాన కార్యదర్శి తలకొక్కుల వెంకట స్వామి, కోషాదికారి కొండ్ల వెంకటేశం పద్మశాలి, సహాయ కార్యదర్శి నాగరాజు, సలహాదారులు బిల్లా యాదగిరి, రుద్రవీణ, విజయ్‌కుమార్, గుర్రం బచ్చయ్య, పాండు, అరుణ బాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

## దూసరి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పూజ



నల్లకుంటలోని తన నివాసంలో అయ్యప్ప స్వామి పూజ నిర్వహిస్తున్న దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అప్పయ్యస్వామి పూజ ఘనంగా జరిగింది. ఆదివారం నల్లకుంటలోని తన నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజకు స్వాములు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దూసరి వెంకట్‌గౌడ్, దూసరి మహేష్, ఎస్.లక్ష్మణ్‌గౌడ్, రాజుగురుస్వామిలు పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా పడిపూజ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు రాజు గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారి భజనలు జరిగాయి.



అకృతి సుధాకర్‌ను సత్కరిస్తున్న కృష్ణమోహన్‌రావు

## సత్కరించుకోవడంలో వైవిధ్యం ఉంది

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: అత్యున్నత ప్రమాణాలతో, వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించే సంస్థ అకృతి అని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు చెప్పారు. విభిన్న దిగ్గజ ప్రముఖులను సత్కరించిన అకృతి సుధాకర్‌ను నేడు సత్కరించుకోవడం కూడా వైవిధ్యంగా ఉందన్నారు. సుపథం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో సుధకార్‌కు జరిగిన ఆత్మీయ సత్కారంలో ఆయన ప్రసంగించారు. సమాజంలో ఎక్కడ మంచి ఉంటుందో అక్కడ గుర్తింపు వస్తుందనే సిద్ధాంతాన్ని నమ్మి అకృతి సుధాకర్ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని ఆయన చెప్పారు. సుధాకర్‌కు జరిగిన సత్కారం మొత్తం కళారంగానికి సంబంధించిన సత్కారంగా భావిస్తున్నానని కృష్ణమోహనరావు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న టి-పిసిసి అధికార ప్రతినిధి కల్వ సుజాతగుప్తా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళలకు, కళాకారులకు ప్రాధాన్యత ఇసు_ందన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవి కబ్ల్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్‌రావు, సుపథం అధినేత మోహన్‌కృష్ణ తదితరలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: నల్లకుంటలోని ఆర్యవైశ్య సంఘం రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం బాగ్ అంబర్‌పేటలోని ఒక హోటల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బెజవాడ అంజన్నగుప్తా, కోశాధికారి ఉప్పల్ శ్రీనుకుమార్‌గుప్తా, లింగప్రకాష్‌గుప్తా, కె.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ రజక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కార్పోరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు

## తాయిక్వాండోలో

# చిన్నారులకు, యువతీ యువలకు శిక్షణ

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: నేటి సమాజంలో జరుగుతున్న దాడులను ఎదుర్కొవడానికి, ఆత్మరక్షణ కోసం యువతీ, యువకులకు తాయిక్వాండో విద్యా (కరాటె)లో శిక్షణ ఎంతో ముఖ్యమని లీ అకాడమీ వ్యవస్థాపకుడు బొమ్మ యశ్వంత్ చెప్పారు. రాత్రివేళల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఒంటరిగా వెళుతున్న సమయంలో అకతాయిలు ఎవరూ ఎక్కడ నుంచి దాడులు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని, వారి నుంచి రక్షించుకోవడానికి ఆత్మరక్షణకు ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యను నేర్చుకునేందుకు అసక్తిగల చిన్నారులు, యువతీయువకులు అమీర్‌పేట్‌లోని ధరమ్‌కరం రోడ్డులోగల వివేకాందనంద కమ్యూనిటిహాల్‌లో లీ అకాడమీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యశ్వంత్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆనేక మెడల్స్‌ను సాధించడం జరిగిందని, అంతేకాకుండా ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారని గురువులు తెలిపారు. ఈ మెడల్స్ సాధించడం వెనుక తల్లిదండ్రులు, గురువులైన మాస్టార్ జి.ప్రభాకర్‌గౌడ్, కె.శ్రీహరి, సీనియర్ కోచ్‌ల సహాయంతో తాయిక్వాండో విద్యను అభ్యసించి, ఎంతో మందికి శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో నిలబెట్టడం జరిగిందన్నారు. ఈ విద్య ద్వారా చిన్నారుల్లో ఆత్మరక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ ఎబిలిటి పెంపొందించడం కోసం తమ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు, మెడల్స్, ప్రసంశపత్రాలను అందజేయడం జరుతుందన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల ఇళ్ల స్థలాలలో న్యాయం చేయాలి

సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త: పెన్షనర్లకు కేటాయించిన ఇళ్ళ స్థలాల పంపిణి ప్రక్రియను అడ్డుకునే కుట్రలను మానుకోవాలని, ఇళ్ళ స్దలాల పంపిణిని విచ్ఛిన్నం చేయాలనే కుట్రదారుల చర్యలను పసిగట్టి పెన్షనర్లకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఆనేక మంది ఈ కుట్రలకు వ్యతిరేకంగా గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం శౌరలింగంపల్లిలోగల గోపన్నపల్లిలోని ఉద్యోగులకు నాటి ప్రభుత్వం ఇళ్ళ స్దలాలు కేటాయించగా కొంత మంది ఉద్యోగ సంఘ నేతల స్వార్థపూరిత చర్యల వల్ల స్దలాలు న్యాయస్థానం వివాదంలో చిక్కుకుని పంపిణి ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. దీంతో ప్రస్తుతం భాగ్యనగర్ టిఎన్జీవో గచ్చిభౌలి హౌసింగ్ సొసైటి పాలకవర్గం ఈ స్దలాన్ని తన అధీనంలోకి తీసుకుని సర్వీస్ సీనియారిటి ప్రకారం 845 మంది సీనియర్ పెన్షనర్లను లబ్ధిదారులగా గుర్తించిందన్నారు. సొసైటితో సంబంధం లేనివారు కొంత మంది ఈ ఇళ్ళ స్దలాల పంపిణి ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వం మానవతా దృక్పదంతో వ్యవహరించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న స్థానికులు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యత కల్పిస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని రామారావు నగర్ కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే (సిడిఎఫ్ ఫండ్) నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రామారావు నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు 10లక్షల రూపాయలు మంజూరి చేయడం జరిగిందని, భవనంను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. కమ్యూనిటీ హాల్‌ను కాలనీ సంక్షేమం, అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్‌లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు కాలనీ అధ్యక్షులు రాజు, సత్యశంకర్ జనరల్ సెక్రటరీ, లోకేస్ సెక్రటరీ, జయప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, నాగరాజు, మహేందర్‌రెడ్డి, మహేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అయ్యప్ప నామ స్మరణతో మారుమ్రోగిన గౌలిదొడ్డి

**భగవన్నామ స్మరణంతో సర్వ పాపాలు హరించబడుతాయి : నాగేష్ యాదవ్**



గౌలిదొడ్డిల జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు

నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : భగవన్నామ స్మరణంతో సర్వ పాపాలు హరించబడుతాయని బిఆర్ఎస్ సీనియర్ నేత గొల్ల నాగేష్ యాదవ్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని గౌలిదొడ్డిలో దారుగుపల్లి ప్రభాకర్ గురుస్వామి నిర్వహించిన హరిహర తనయుడు అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తింది. ఉదయం నుంచి రాత్రి 10.గంటల వరకు గౌలిదొడ్డి మొత్తం అయ్యప్ప నామ స్మరణంతో మారుమ్రోగిపోయింది. గోపాల్‌సింగ్, భగువాన్‌సింగ్ గురుస్వాముల చేతులపై ఈ పూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్దపుల ఈశ్వర భజన మండలి చేత నిర్వహించబడ్డ భజన కార్యక్రమం ఆద్యాంతం భక్తులను అలరించింది. వందలాది మంది అయ్యప్ప మాల ధారులు, భక్తులు ఈ వేడుకలో పాల్గొని లయబద్ధంగా భజన పాటలు ఆలపిం చారు. ఈ వేడుకలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు గొల్ల నాగేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలంతో సమానంగా పరుగులు తీస్తున్న నేటి ఆధునిక కాలంలో సైతం యువతరం ఆధ్మాత్మికతకు పెద్దపీఠ వేస్తుండడం, అయ్యప్ప మాలలు ధరిస్తూ, కఠిన నియ మాలను పాటిస్తుండడం ఆనందంగా ఉంద న్నారు. ఆధ్యాత్మికతలో లభించే ఆనందం, సంతృప్తి అనంతమైందన్నారు. మన సనాతన ధర్మంలోని ప్రతీ ఆచారం, పర్వదినం సర్వ ప్రాణికోటికి మేలు చేసేదిగా ఉంటుందని, ఇందుకు మనం గర్వించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు సంతోష్, తిరుపతయ్య, అన్నదాతలు దారుగుపల్లి ప్రమీల, సత్యనారాయణ, సుధాకర్‌లతో పాటు భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొని కలియుగ ప్రత్యక్ష దైవమైన అయ్యప్ప స్వామి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు.

## బ్రహ్మానందంకు జీవితసాఫల్య పురస్కారంతో స్వర్ణకంకణం ప్రదానం

రవీంద్రభారతి, డిసెంబరు 31 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ రాగసప్తస్వరం 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ నటుడు, హాస్యబ్రహ్మ బ్రహ్మానందంకు జీవిత సాఫల్య పురస్కారంతో స్వర్ణకంకణ ప్రదానం, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ నాట్యగురువు జమైకా ట్రేడ్ కమిషనర్ వింజమూరి సుజాతకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఎస్.రాజ్యలక్ష్మి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ నెల 3 బుధవారం సాయంత్రం 5.30గంటల నుండి తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హర్యానా రాష్ట్ర గవర్నరు బండారు దత్తాత్రేయ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమశాఖల మంత్రి డా. ధనసరి అనుసూయ సీతక్క, పార్లమెంటు సభ్యుడు డా. కె.లక్ష్మణ్, రామకృష్ణరాజు, ఎం.మురళీమోహన్, టర్కీ కాన్సలేట్ జనరల్ ఎల్మన్ ఒకన్, ఐటో ప్రెసిడెండ్ డా. అసఫ్ ఇక్బాల్ తదితరులతో కలిసి ముందుగా ప్రముఖ నటుడు బ్రహ్మానందంను ఘనంగా జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించి స్వర్ణకంకణం ప్రదానంచేసి, అనంతరం వింజమూరి సుజాతకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా సంస్థ సభ్యులు రాజ్యలక్ష్మి, కె.అహల్య, శ్రీదేవి, సుజాతలతో కలిసి ఆవిష్కరించి అధిక సంఖ్యలో సినీప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బస్తీలు, కాలనీలల్లో అయోధ్య శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ



కళశాలతో బస్తీలో పర్యటన చేస్తున్న సంయోజక్‌లు మహిళలు

హైదరాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: బస్తీలు కాలనీలల్లో అయోధ్య శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి రామ భక్తిని నింపేందుకు శ్రీరామ పూజిత అక్షితల కళశాల వితరణ కార్యక్రమాన్ని చేపట్టామని శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర సభ్యులు మూల రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శ్రీహనుమాన్ ఆలయం, జైస్వాల్ గార్డెన్, ఓల్డ్ జైస్వాల్ గార్డెన్, ఖాద్రి భాగ్, శంకర్‌నగర్ బస్తీలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంయెజక్‌లు, సంచాలక సమితి సభ్యులు భజన చేస్తూ ఊరేగింపుగా కలశాలతో తిరిగారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర సభ్యులు ఎస్.శ్రీధర్ గౌడ్, సి.శ్రీనివాస ముదిరాజ్, కర్రి రవీందర్, ప్రసన్నాంజనేయులు, వినోద్‌కుమార్, జి.వంశీకృష్ణ, ఎం.అరుణ్ కుమార్, శ్రీనివాస్, శోభ, స్వప్న, ప్రియ, నాగిని, అనిల్ చారి, జె.కె.రాయుడు, శంకర్ గౌడ్, మంజుల, సతీష్, శివకుమార్, చంద్రశేఖర్ గౌడ్, మధు గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ బిజెపి కార్యాలయంలో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 108వ మన్‌కీ బాత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీ ధర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత వ్ంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాజేంద్రనగర్ ఎస్‌సి మోర్చ అధ్యక్షులు తొండుపల్లి మల్లేష్, బిజెపి నాయకులు ఎం.భాస్కర్ యాదవ్, కె.నర్సింహ, వై.హరగోపాల్, కె.లక్ష్మీ నారాయణ, ఎ.జ్ఞానేశ్వర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్**

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 31, ప్రభాతవార్త : ప్రజల మధ్యలో ఉండి ప్రజాసేవ చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబును కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దాదాపు 200మందితో మర్యాదపూర్వకంగా రాష్ట్ర సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

